క్లుప్తంగా

కొత్త కోడూరులో మోదకొండమ్మ పండగ



మోదకొండమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ఎస్ఈజెడ్ కాలనీ కొత్త కోడూరులో మోదకొండమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పూలతో అలంకరించారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీహరి

మునగపాక : భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు శ్రేయస్కరమని బీసీటీ-కేవీకే భూసార పరీక్ష శాస్త్రవేత్త శ్రీహరి అన్నారు. పల్లపు ఆనందపురంలో రైతులకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నేలలో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూమిలో ఎటువంటి పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకునే అవకాశం ఉందన్నారు బీసీటీ సామాజిక కార్యకర్త పి.ఎ.నాయుడు, నూకాంబిక రైతు క్లబ్ కన్వీనర్, కో-కన్వీనర్లు మోహనరావు, వీర సంతోష్, రైతు అల్లవరపు రమణబాబు పాల్గొన్నారు.

నీరు, విద్యుత్ వృథా చేయొద్దు



లైఫ్ స్టైల్‌పై అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలో లైఫ్ స్టైల్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎల్.విజయ్ కుమార్ తెలిపారు. నీరును వృథా చేయరాదని, విద్యుత్ ఆదా చేయాలని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపడుతున్నారు. మంగళవారం అరట్లకోట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షెల్వర్ బెల్టు సెక్షన్ అధికారి ఎం.కృష్ణ, అటవీశాఖ సిబ్బంది వున్నారు.

కథలు చెప్పడంపై సాధన



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. సెలవులు కావడంతో విద్యార్థులు శిబిరాలలో నిర్వహిస్తున్న వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడంపై సాధన చేయించారు. రీసోర్స్ పర్సన్స్‌గా ఉపాధ్యాయులు ప్రసాద్, మస్తాన్, మాణిక్యం పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

రాంబిల్లి : సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో హరిపురం సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లోనే పలు రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అలాగే ఎంపీడీవో అంగన్‌వాడీ కేంద్రం, సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి ప్రభంజనం

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగో వార్షికోత్సవం



యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, సుకుమారవర్మ



అడ్డురోడ్డులో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

యలమంచిలి : ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు తీరు వల్లే పోలవరం నిర్మాణం పనులు అలస్యంగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వంలో కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టి పోలవరం ప్రాజెక్ట్ డిజైన్‌లో మార్పులు చేయడం వంటి తప్పుడు ఆలోచన వల్లే ప్రస్తుతం ఈ దుస్థితి ఏర్పడిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు)అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాలుగు మండలాల పార్టీశ్రేణులు, అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.

ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు పెట్టిన మొదటి సంతకం ఎంతో విలువైనదని, రాష్ట్రంలో ఇప్పటి వరకు కొత్త పథకాలకు విరామం లేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంతకాలు పెడుతూనే ఉన్నారని అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామని, నాలుగు మండలాల్లో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశామని, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు, అమూల్ పాలేంద్రాలు నిర్మాణం, నియోజకవర్గంలో 83 సచివాలయాలు నిర్మాణం చేశామని అన్నారు. యలమంచిలి పట్టణంలో 101 కోట్ల రూపాయలతో భారీ మంచి నీటి పథకం, 100 పడకల నూతన అస్పత్రి నిర్మాణం, రూ.40 కోట్లతో శాశ్వత మురునీటి పరిష్కారానికి అమృత్ పథకం ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైయినేజి నిర్మాణం, మున్సిపాలిటీల్లో హెల్త్ క్లినిక్ సెంటర్లు నిర్మించామని ఇది కాదా అభివృద్ధి అని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు అవినీతి లేకుండా పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఇప్పుడు కొత్త మేనిఫెస్టోతో వస్తున్నాడని, గత ప్రభుత్వంలో నిరుద్యోగ భృతి ఇస్తాన్నాడు కాని ఒక్క లోకేష్‌కే నిరుద్యోగ భృతి కల్పించాడని, ఆయన హామీలను ఎవరూ నమ్మరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, బొద్దపు యర్రయ్యదొర, సచివాలయ కన్వీనర్ కర్రి శివ, మండలంలో ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : మాటల ప్రభుత్వ కాదిది.. చేతల ప్రభుత్వం అని నిరూపించి చూపించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొనియాడారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయి ఐదో ఏట అడుగుపెడుతున్న సందర్భంగా అడ్డురోడ్డు కూడలిలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దాలుగా నెరవేరని సమస్యల పరిష్కారానికి గడిచిన నాలుగేళ్లలో కృషి చేశానన్నారు. ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి ప్రాజెక్టుకు రూ.205 కోట్లు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుటామన్నారు. నక్కపల్లి ఆస్పత్రి 50 పడకలు, కోటవురట్ల మండలం సీహెచ్‌సీ విస్తరణ, పాయకరావుపేట , ఎస్.రాయవరం మండలాల్లో పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మాణాలు చేసి చూపించామన్నారు. చంద్రబాబునాయుడు నమ్మశక్యం కాని మానిఫెస్టోలు ఎన్ని పెట్టినా ప్రజలు నవ్విపోతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి ఓ వైపు, సంక్షేమం మరోవైపుగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిధులు వర్షం కురిపించారన్నారు. ఈ పథకాలు చూసి ప్రతిపక్షాలు నోరు మెదపలేని స్థితిలో ఉన్నారన్నారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, పార్టీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందు, పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, ఎస్.రాయవరం, పాయకరావుపేట , నక్కపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు, ధనిశెట్టి బాబూరావు, పొడగట్ల పాపారావు, బీసీ సెల్ జిల్లా కన్వీనర్ పైలా రమేష్, మత్స్యకార సంఘం డైరెక్టర్ చోడిపల్లి శ్రీనువాసరావు, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలం జెడ్పీటీసీలు లంక సూరిబాబు, గోసల కాసులమ్మ, కాకర దేవి, ఎస్.రాయవరం, నక్కపల్లి ఎంపీపీ లు కోన లోవలక్ష్మి,రత్నం , వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు పాల్గొన్నారు.

పుస్తక సమీక్షలపై అవగాహన



పుస్తక సమీక్షలు రాసిన విద్యార్థులకు బహుమతులు

పాయకరావుపేట : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పుస్తక సమీక్షలపై అవగాహన తరగతులను నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పుస్తక పఠనం ఆవశ్యకతను ముందుగా వారికి తెలియజేశారు. నూతన విద్యావిధానంలో పుస్తక సమీక్షలకు ప్రాధాన్యం పెరిగిందని ప్రతి విద్యార్థి వాటి పై తప్పరిసరిగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కథ, దేశ నాయకులు, మ్యాగ్‌జైన్ వంటి ఒక అంశాన్ని చదివి రెండు పేజీలకు మించకుండా ఒక పేజీ తగ్గకుండా సమీక్షలు రాయడం అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల ఏ అంశాన్నైనా సొంత మాటల్లో వ్యక్తీకరించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు కథల పుస్తకాలను అందించి వారిచే పుస్తక సమీక్షలు రాయించి గ్రంథాలయంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు యోగా గురువు శ్రీనివాసరాజు, వై.అచ్చుతరావు, ఎస్.సీతరామయ్య. తేజోమూర్తులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అవినీతి రహిత పరిపాలనే లక్ష్యం



ఏఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పరిపాలనందిస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో ఏఎస్ఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో సమస్యలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వార్డు సచివాలయం సమావేశంలో పలువురు నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీరు వ్యవస్థ వల్ల ప్రజలకు నేరుగా పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉందని, కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఏఎస్ఆర్ కాలనీలో రూ.35న్నర కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. కాలనీలో నూతనంగా నిర్మించిన రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వలంటీర్లుకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. నాలుగు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ రోడ్లు, డ్రైయినేజి, తాగునీటికి ఏఎస్ఆర్ కాలనీలో అధిక నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామ న్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోనడానికి సహాయ పడిందని అన్నారు. వలంటీరు వ్యవస్థ క్రియాశీలంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, బొద్దపు యర్రయ్యదొర, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రిశివ, కౌన్సిలర్ పడాల కావ్యశ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం శివ,దాసరి కుమార్,ప్రతాప్‌రాజు, సేనాపతి రాము, తహశీల్దారు రాణీ అమ్మాజీ,మున్సిపల్ డిఇ.వీరయ్య,శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలివెళ్లిన నాయకులు

పాయకరావుపేట : నియోజకవర్గంలో గల అడ్డురోడ్డులో మంగళవారం జరిగిన విజయోత్సవ సభకు పాయకరావుపేట నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో భారీ సభ నిర్వహించారు. పాయకరావుపేట నుండి పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మండల పరిషత్ అధ్యక్షుడు ఇసరపు పార్వతీ తాతారావు ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి సభకు వెళ్లారు. వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పంచాయతీ సభ్యులు జగతా శ్రీను, పి.గోవిందు, టి.సతీష్, గూటూరు రామగోవిందు, పెనుమత్స నాగేశ్వరరావు, గదుల లోవరాజు, గూటూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట : వైఎస్సార్ సీపీ 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభకు పాయకరావుపేట నుంచి ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో బీసీ నాయకులు, మత్స్యకార నాయకులు ఎం.అశోక్ చక్రవర్తి, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, దోమాడ సుందర్రావు తదితర నాయకులు బయలుదేరి వెళ్ళారు.

మునగపాకలో నిర్విరామంగా మజ్జిగ చలివేంద్రం



మునగపాకలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక: వేసవి కాలంలో ఎండవేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మునగపాకలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం నిర్విరామంగా కొనసాగుతోంది. మునగపాక గ్రామ ప్రజల సహకారంతో పీఏసీఎస్ కార్యాలయం ఎదుట 44 రోజుల క్రితం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు మజ్జిగ పంపిణీ నిర్విరామంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారికి ఈ చలివేంద్రం ఎంతగానో దోహదపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రీ-సర్వే వేగవంతమయ్యేలా చూడాలి



రీ-సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో చిన్నికృష్ణ

మునగపాక: రీ-సర్వే వేగవంతమయ్యేలా చూడాలని అనకాపల్లి ఆర్‌డీవో చిన్నికృష్ణ కోరారు. మునగపాక రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సాయంత్రం సందర్శించారు. మండల వ్యాప్తంగా రీ-సర్వే ఎంతమేర జరిగిందనే విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే సరిహద్దు రాళ్ల పాతే సమయంలో రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములను పరిరక్షించేలా పాటుపడాలన్నారు. ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాసరావులు ఆయన వెంట పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

రాంబిల్లి : విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకొని క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని దిమిలి మహిళా పోలీస్ వెంకటలక్ష్మి అన్నారు. దిమిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు దూరంగా వుండాలన్నారు. రీసోర్స్ పర్సన్ నూకినాయుడు నీతి కథలు చెప్పారు. ఈ నీతిని గమనించి పాటించాలని ఆయన సూచించారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగపాక: మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు హాజరు కావాలని రవికుమార్ కోరుతున్నారు.

దిశయాప్ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ ఆలీ

మునగపాక : దిశ యాప్ రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలని ఎస్ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో ఆయన మంగళవారం మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎంలు, బ్యాంక్‌ల వద్ద సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని, ప్రతి బ్యాంక్ వద్ద రాత్రుల సమయంలో సెక్యూరిటీ ఉండేలా బ్యాంక్ అధికారులకు వివరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. అలాగే భార్య, భర్తల మధ్య వివాదాల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

లాడ్జిలో హత్య కేసులో కఠిన చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ఎస్‌కేఆర్ లాడ్జిలో మహిళను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం అచ్యుతాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లాడ్జిలో జరిగిన హత్యకు యాజమాన్యం కూడా బాధ్యత వహించాలని, ఎవరెవరు లాడ్జికు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారనే అంశంపై అవగాహన ఉండాలని ఆమె పేర్కొన్నారు.మహిళలకు రక్షణ కరువైందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మి, మహాలక్ష్మి,విజయ,దివ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము జెండా ఆవిష్కరణ చేసి సీఐటీయూ చేపట్టిన ఉద్యమాల గురించి వివరించారు. కె.సోమునాయుడు, చండీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పుస్తకాల పంపిణీ

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. వాడ్రాపల్లి సచివాలయంలో శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా ఆయన మంగళవారం రైతులకు పట్టాదారు పుస్తకాలు అందజేశారు. రైతుల మధ్య భూ వివాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు,వైఎస్సార్‌సీపీ మహిళా నేత శీరా రమణమ్మ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రాంబిల్లి : దిమిలిలో మంగళవారం రోడ్డుపై నిలిచిపోయిన మురుగును పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ నెల 21న మురుగుతో అవస్థలు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సర్పంచ్ బంగారు చిలుకు, పంచాయతీ కార్యదర్శి జి. రాజుబాబు స్పందించి మురుగు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. మురుగుకాలువలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాజుబాబు తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

ఎస్.రాయవరం : సైతారుపేట దళిత కాలనీలో కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభిస్తున్నట్లు సమరసత ఫౌండేషన్ సభ్యులు గంగాధర్ తెలిపారు. బుధవారం ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం, విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఈ సందర్భంగా మంగళవారం శాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుక్ రీడింగ్‌పై అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం బుక్‌రీడింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి శిక్షణా శిబిరాల 23వ రోజుని పురస్కరించుకొని రిసోర్స్ పర్సన్ శివకృష్ణ ఆధ్వర్యంలో పుస్తక పరిచయం, పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు విశదీకరించారు.

బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



బ్యాంకు సిబ్బందితో సమావేశం నిర్వహించిన సీఐ నారాయణరావు

నక్కపల్లి: బ్యాంకుల వద్ద, పలు ప్రాంతాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని నక్కపల్లి సీఐ నారాయణరావు సూచించారు. మంగళవారం ఆయన నక్కపల్లి మండలంలో ఉన్న పలు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికలతో చోరీలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద వీరు ప్రత్యేక దృష్టి సారించారని, బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసే వారిపై దృష్టి కేంద్రీకరించి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. సెలవుల కారణంగా దూర ప్రాంతాలకు వెళ్లిన వారి ఇళ్లపై కూడా ఈ ముఠాలు రెక్కీలు పెడుతున్నారన్నారు. బ్యాంకుల వద్ద ఏటీఎంల వద్ద క్వాలిటీతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. రేయింబవళ్లు చోరీలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనుమానితులు కనిపించినా, వారి నడవడికలపై అనుమానం వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇళ్లల్లో విలువైన బంగారు ఆభరణాలు ఇతర వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు, ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

ఐదుగురికి వైఎస్సార్ పెళ్లి కానుక అందజేత



వైఎస్సార్ పెళ్లి కానుకను అందజేస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: వైఎస్సార్ పెళ్లి కానుక పేదరికంలో ఉన్న అమ్మాయిలకు ఎంతగానో ఉపకరిస్తోందని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో ఐదుగురు లబ్ధిదారులకు వైఎస్సార్ పెళ్లి కానుకను ఐదుగురు మంగళవారం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదలకు వివాహ సమయంలో ఆసరా కల్పించాలనే ఆశయంతో వైఎస్సార్ వివాహ కానుకను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.లక్ష సాయం, కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహానికి రూ.75 వేలు ఆర్థిక సాయంగా అందిస్తున్నారన్నారు. మన గ్రామంలో ఐదుగురికి వివాహ కానుక వచ్చినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వివాహ సమయంలో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంట కాలువ పూడికతీతకు వినతి



కంపెనీ ప్రతినిధికి వినతి పత్రం అందిస్తున్న ఎంపీడీవో

పాయకరావుపేట : సత్యవరం గ్రామ పరిధిలో గల రైతులకు సాగు నీరు సరఫరా చేసే ఊర కాలువకు పూడికతీత తీయించాలని డెక్కన్ కంపెనీ ప్రతినిధులకు ఎంపీడీవో ఎ.సాంబశివరావు వినతి పత్రం అందించారు. సత్యవరం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు డెక్కన్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదించి కాలువ పూడికతీతకు సహకరించాలని చెప్పారు. దీంతో కంపెనీ యజమాన్యం కాలువ పూడిక తీతకు అంగీకారం తెలిపారు. సత్యవరం గ్రామ పంచాయితీ పాలకవర్గం కూడా తీర్మానంతో పాటు, మండల పరిషత్ నుంచి కూడా వినతి పత్రం కలిపి కాలువ పూడికతీత తీయించాలని కంపెనీ ప్రతినిధి సూర్యనారాయణ రాజుకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందించారు. సీఎస్ఆర్ నిధులతో కాలువ పూడికతీత పనులు చేపట్టనున్నారు.

ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



యలమంచిలిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో కూడిన విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో రైతులకు రాయితీ విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల విత్తనాలను రాయితీతో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తుందని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని విత్తనాలు, ఎరువులు, మందులు అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ద్వారా మద్దతు ధర ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జీలుగ, జనుము, పిల్లి పెసర, విత్తనాలు ప్యాకెట్‌లను రైతులకు అందజేశారు. ఏడీఏ రవిప్రకాష్, వ్యవసాయాధికారులు ఏవోలు పాల్గొన్నారు.